క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఆలయ ప్రారంభోత్సవం



కలశాలతో ఊరేగింపుగా వస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని పూశాం గ్రామంలో నిర్మించిన ఉమాచంద్రమౌళీశ్వర స్వామి ఆలయ ప్రారంభ మహోత్సవ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాల్లో భాగంగా సోమవారం దేవతా విగ్రహాల ఊరేగింపు, యాగశాల ప్రవేశం, ప్రత్యేక పూజలు నిర్వహించామని గ్రామ పురోహితుడు నేతేటి వెంకటరమణమూర్తి తెలిపారు. సర్వాజ్యోష్యుల లక్ష్మీవెంకట గౌరీ వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు.

సాహిత్యంతోనే చైతన్యం



మాట్లాడుతున్న సాహిత్యవేత్త కోటిబాబు

కొత్తూరు: సమాజాన్ని పట్టిపీడిస్తున్న మూఢ నమ్మకాలు, రుగ్మతలను సాహిత్యంతో పారదోలవచ్చని ప్రముఖ సాహిత్యవేత్త పొట్నూరు కోటిబాబు అన్నారు. కొత్తూరులో సోమవారం కొత్తూరు మండల రచయితల వేదిక సమ్మేళనం నిర్వహించారు. స్వాతంత్ర్య పోరాటంలో పలువురు రచయితలు చేపట్టిన రచనలు, గేయాలతో ఎంతో చైతన్యం తీసుకువచ్చారన్నారు. వాటిని స్ఫూర్తిగా తీసుకొని ఎంతో మంది స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. కొత్తూరు మండల రచయితల వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కుదుమ తిరమలరావు మాట్లాడుతూ.. సాహిత్యంతో సమాజంలో అనేక మార్పులు వచ్చాయన్నారు. ప్రతిభావంతులైన పలువురు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. పలువురు కవులను, రచయితలను సత్కరించారు. రచయితల వేదిక సభ్యులు కలమట శ్రీరాములు, వై.అప్పలనాయుడు, ఉషారాణి, దిలీప్ పట్నాయక్, జి.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామానికి చెందిన పాదిలాపు చంద్రమ్మ ఇటీవల మృతి చెందారు. మృతురాలి కుటుంబ సభ్యులకు గ్రామానికి చెందిన మదర్ థెరిసా, స్వామీ వివేకానంద యువజన సేవా సంఘం సభ్యులు సోమవారం రూ.16,500 అందజేశారు. మృతిరాలి భర్త సింహాచలం, కుమార్తె తేజేశ్వరిని పరామర్శించారు. గ్రామస్తులు, యువకులు పాల్గొన్నారు.

నేడు వైద్య శిబిరం

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి సోమవారం తెలిపారు. మెడికవర్ ఆస్పత్రి వైద్యుల ఆధ్వర్యంలో శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారికి ఉచితంగా తనిఖీలు, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ఈ ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు దారుణం

నరసన్నపేట: మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాళ్ల కేశవరావు మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురానీయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకోవడం దారుణమని సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు నేతింటి నీలంరాజు, ఏఐకేఎంఎస్ నాయకుడు బైరి కూర్మారావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వాల దుశ్చర్యలను ప్రజలు, ప్రజాతంత్ర వాదులు ఖండించాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసుల్ని, మావోయిస్టుల్ని బూటకపు ఎన్‌కౌంటర్‌ల పేరుతో హత్యలు చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి కేశవరావుతోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన మరో నలుగురు మావోయిస్టు నాయకుల మృతదేహాలను అప్పగించాలని డిమాండ్ చేశారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

నరసన్నపేట: పట్టణంలోని మెయిన్ రోడ్డుకు ఆనుకొని ఉన్న డ్రైనేజీలపై పలకలు వేసి దోమల నివారణకు చర్యలు చేపట్టాలని నరసన్నపేట పౌర వేదిక కన్వీనర్ ఆర్.సునేష్‌బాబు, సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పలుచోట్ల డ్రైనేజీలపై పలకలు లేకపోవడంతో వ్యాపారులు చెత్త కుండీల్లా వాటిని వాడుతున్నారన్నారు. వర్షం పడితే నీరు కాలువల్లో కాకుండా రోడ్డుపై మురుగునీరు ప్రవహించి దోమలు విజృంభిస్తున్నాయన్నారు. పంచాయతీ సిబ్బంది వెంటనే స్పందించి ఓపెన్ డ్రైనేజీలపై పలకలు వేయాలని కోరారు.

ప్రత్యేకావసరాల చిన్నారులకు.. బంగారు భవిత

- ఇంటింటికీ వెళ్లి ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు
- సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పథకాలు అందించేందుకు చర్యలు
- జూన్ 9వ తేదీ వరకు సర్వే..



పోలాకి మండలం పాతూరులో సర్వే చేస్తున్న సిబ్బంది

నరసన్నపేట: ప్రత్యేకావసరాల గల చిన్నారులు ఇంటికే పరిమితం కాకుండా వారిని శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చేసి.. విద్యాబుద్ధులు నేర్పించేందుకు భవిత కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. వీరు కూడా మిగిలిన పిల్లల మాదిరిగానే అన్ని అవకాశాలు అందిపుచ్చుకొనేలా ప్రతీ మండలంలో భవిత కేంద్రం ఏర్పాటు చేసి సహిత విద్యను ప్రభుత్వం అందిస్తోంది. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో భవిత కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణంలో నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా ఆశించిన ఫలితాలు వస్తుండటంతో సమాజంలో ఇంకా మిగిలి ఉన్న ప్రత్యేకావసరాల గల పిల్లలను గుర్తించేందుకు సహిత విద్య మండల కో ఆర్డినేటర్లు సర్వే చేస్తున్నారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు జరగనుంది. ఇంక్లుజన్–2025లో భాగంగా ప్రత్యేకావసరాల పిల్లలందరికీ వారికి అవసరమైన విద్యను అందించడం, ప్రతీ చిన్నారిని వారి వయసుకు తగ్గట్టుగా పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేకావసరాల పిల్లల విద్యను డిజిటలైజేషన్ చేసి టాబ్స్‌ను అందజేస్తున్నారు.

ప్రత్యేక సేవలు..

మానసిక దివ్యాంగుల్లో విద్యార్థి దశలో ఉన్నవారికి విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు ప్రతీవారం ఫిజియోథెరపీ సేవలను అందజేస్తారు. ప్రత్యేకావసరాల గల వారిని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించడం, పాఠశాలలకు రప్పించేలా భవిత కేంద్రాల్లోని ఐఈఆర్‌పీలు చర్యలు తీసుకుంటున్నారు. నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 774 మంది ఉన్నారు. హోమ్ బేస్డ్ సేవలు కూడా అందిస్తున్నారు. పూర్తిగా కదల్లేని వారికి ఇళ్లకు వెళ్లి ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నారు.



బసివలసలో సర్వే నిర్వహిస్తున్న ఐఈఆర్పీ

నాలుగు రకాల అలవెన్సులు

ప్రత్యేకావసరాల గల పిల్లలకు నాలుగు రకాల అలవెన్సులు ప్రభుత్వం అందజేస్తుంది. ఎస్కార్ట్, ట్రాన్స్‌పోర్టు, హోమ్ బేసిడ్, గరల్ చైల్డ్, రీడర్ అలవెన్సులను అందజేస్తోంది. అంధులకు రీడర్ అలవెన్స్‌గా 10 నెలలకు రూ.2 వేలు ఇస్తున్నారు. బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్ కింద ఒక్కో విద్యార్థికి పది నెలలకు రూ.3 వేలు అందిస్తున్నారు. ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ 10 నెలలకు రూ.3 వేలు, గర్ల్ చైల్డ్ అలవెన్స్ రూ.2 వేలు, హోమ్‌బేస్డ్ అలవెన్స్ రూ.3 వేలు అందజేస్తున్నారు.

సేవలు అందించేందుకే సర్వే



భవిత కేంద్రాల పరిధిలో విద్యతోపాటుగా వారికి అవసరమైన సేవలు అందించేందుకు సర్వే నిర్వహిస్తున్నాం. ప్రతీ చిన్నారిని గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పిస్తాం. నరసన్నపేట మండలంలో ఇప్పటివరకు 13 మందిని గుర్తించాం. నియోజకవర్గంలో 72 మందిని గుర్తించాం.

– శ్రీనివాసరావు, ఐఈఆర్పీ, నరసన్నపేట

నరసన్నపేట నియోజకవర్గంలో ప్రత్యేకావసరాల గల పిల్లల వివరాలు

మండలం	నరసన్నపేట	పోలాకి	సారవకోట	జలుమూరు
0–18 వయసు పిల్లల సంఖ్య	210	242	170	152
కొత్తగా గుర్తించిన వారి సంఖ్య	16	23	11	22

గిరిజనుల ఆందోళన

కొత్తూరు: మండలంలోని పొనుటూరు పంచాయతీ పరిధి బంజరగూడ, బంకిగూడ, మొత్తడూడ గ్రామాలకు చెందిన గిరిజనులు తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు సోమవారం కుటుంబాలతో ధర్నాకు దిగారు. వ్యవసాయ కార్మిక సంఘం, ఏపీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాద్‌తో పాటు పలువురు గిరిజనులు మాట్లాడుతూ తామంతా ఒడిశా నుంచి ఉపాధి కోసం వచ్చామని, రేషన్ కార్డులు, ఓటరు కార్డులు కూడా ఇక్కడే ఉన్నాయని, అయినా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదన్నారు. పత్రాలు లేకపోవడంతో పిల్లల చదువులకు ఇబ్బంది కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాలకు మౌలిక సదుపాయాలు సైతం కల్పించడం లేదన్నారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రంను తహసీల్దార్ ప్రసాద్‌రావుకు అందజేశారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న పొనుటూరు గిరిజనులు

జలమయం



నరసన్నపేట: బజారు వీధిలో ఉప్పొంగిన వర్షం నీరు



నరసన్నపేట: మరంవీధి కూడలి నుంచి పంచాయతీ కార్యాలయం రోడ్డుకు వస్తున్న వర్షం నీరు



నరసన్నపేట: పుండరీకాక్ష కాలనీ మీదుగా ప్రధాన రోడ్డుపైకి వస్తున్న వరదనీరు



మెళియాపుట్టి: బండార్లమ్మ వీధిలో మురుగు కాలువను శుభ్రం చేస్తున్న స్థానికుడు

నరసన్నపేట: నియోజకవర్గ కేంద్రం నరసన్నపేటలో సోమవారం కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. రోడ్లన్నీ కాలువలను తలపించాయి. బజారు వీధిలో వరదనీరు చేరింది. ప్రజలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. 30 నిమిషాలు భారీ వర్షం పడింది. పుండరీకాక్ష కాలనీ రోడ్డు నుంచి పంచాయతీ కార్యాలయం వరకు వరదనీరు రోడ్లపై ప్రవహించింది. గతంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి సంబంధించిన మేన్‌హోల్స్ ఓపెన్ చేయకపోవటం వల్ల ఈ విధంగా రోడ్లపై నీరు ప్రవహించిందని స్థానికులు తెలిపారు. కలివరపుపేట, శివనగర్‌కాలనీతోపాటు పలు వీధుల్లో వరదనీరు అధికంగా చేరింది. వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వర్షంనీరు కాలువల్లో కాకుండా రోడ్డుపై ప్రవహించింది. దీంతో మురుగునీరు రోడ్డుపైకి చేరింది.

మెళియాపుట్టిలో భారీ వర్షం

మెళియాపుట్టి: మండల కేంద్రంతోపాటుగా చాపర, చీపురుపల్లి, కొసమాల, వసుంధర, దీనబంధుపురం, మర్రిపాడు–సి, బందపల్లి, తదితర గ్రామాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. ఎండ నుంచి ఉపశమనం కలిగింది. నువ్వులు, తెట్టంగి, పసుపు, కూరగాయలు, తదితర పంటలతో పాటు, జీడిమామిడి తోటలకు మేలు చేకూరుతుందని రైతులు చెబుతున్నారు. వర్షానికి మండల కేంద్రంలోని బండార్లమ్మ వీధిలోని మురుగు కాలువలు నిండి రహదారిపైకి చెత్తాచెదారం చేరింది. స్థానికులు కాలువల్లోని మురుగు తొలగించడానికి వర్షంలోనే పాట్లు పడ్డారు.

ఎల్.ఎన్.పేటలో..

ఎల్.ఎన్.పేట: మండల వ్యాప్తంగా సోమవారం వర్షం కురిసింది. మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలియజేశారు. రోహిణి కార్తెలో వర్షాలు కురిస్తే ఎండల నుంచి ఉపశమనం కలగనుంది.

ఐఏఎస్ వెంకటేశ్‌కు అభినందన



వెంకటేశ్‌ను అభినందిస్తున్న ధర్మాన కృష్ణచైతన్య, నాయకులు

జలుమూరు: సివిల్స్‌లో జాతీయ స్థాయి 15వ ర్యాంక్ సాధించి ఐఏఎస్‌కు ఎంపికైన బాన్న వెంకటేశ్‌ను పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య అభినందించారు. సోమవారం వెంకటేశ్ స్వగ్రామం అల్లాడపేట వెళ్లి సత్కరించారు. అనంతరం కృష్ణచైతన్య మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయాలంటే దేశంలో అత్యున్నతమైన ఉద్యోగం కలెక్టర్ అని, ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా చేరాలంటే యువ అధికారుల వల్లే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కనుసు సీతారాం, అల్లాడ పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు ఎం.శ్యామలరావు, పి.ముసలినాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎం.భాస్కరరావు, వెలమల ఆసిరినాయుడు, బలగ అర్జున్, చందనబాబు, కల్యాణం శ్రీనివాసరావు, పోలాకి మండల నాయకులు ముద్దాడ బైరాగినాయుడు, కణితి కృష్ణారావు, బోర రామకృష్ణ, రేగాన శ్యామ్, నడుపూరి గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: మండలంలోని మూలసవలాపురం పంచాయతీలో శ్మశాన వాటిక స్థలం ఆక్రమణకు గురికావడంతో సర్పంచ్ తర్లాడ ఈశ్వరరావు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీఓ పావని, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి, పోలీసులు దగ్గరుండి శ్మశాన వాటిక స్థల ఆక్రమణలను సోమవారం తొలగించారు. శ్మశాన వాటిక స్థల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వెలగని విద్యుత్ దీపాలు



ఆమదావలలస ఓవర్ బ్రిడ్జిపై వెలగని విద్యుత్ లైట్లు

ఆమదాలవలస: పట్టణ శివార్లలోని శ్రీకాకుళం–ఆమదాలవలస, శ్రీకాకుళం నుంచి పాలకొండ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారి ఓవర్ బ్రిడ్జిపై విద్యుత్ లైట్లు గత వారం రోజులుగా వెలగడం లేదు. అక్కడక్కడ మాత్రమే వెలగడంతో బ్రిడ్జి డౌన్‌లోకి వచ్చే వాహనాలు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఈ ప్రాంతాల్లో రాత్రి సమయంలో ప్రమాదాలు కూడా జరిగాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై విద్యుత్ లైట్లు వెలిగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యోగాతో ఒత్తిడి దూరం



నరసన్నపేట: యోగాసనాలు వేస్తున్న అధికారులు, సిబ్బంది

నరసన్నపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన యోగాసనాల్లో అధికారులు, ప్రభుత్వ సిబ్బంది పాల్గొని యోగాంధ్ర ప్రచారంలో పాల్గొన్నారు. యోగాంధ్ర 6వ రోజు సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో మాకివలస ఆయుష్ వైద్యాధికారి సీతామహాలక్ష్మి ఆధ్వర్యంలో యోగాసనాలు నిర్వహించారు. స్థానిక యోగా శిక్షకులు ఎస్.రవి, సుప్రజ యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ మధుసూదనరావు మాట్లాడుతూ యోగా మాసోత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. యోగాతో ఒత్తిడిని జయించవచ్చన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని యోగా శిక్షకుడు పి.మహేష్ అన్నారు. మండలంలోని తెంబూరు ప్రభుత్వ హోమియో ఆస్పత్రిలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, అంగన్‌వాడీ చిన్నారులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. సూర్య నమస్కారాల విశిష్టతను వివరించారు. డాక్టర్ ఉమాగౌరీ మాట్లాడుతూ నేటి యాంత్రిక సమాజంలో ఒత్తిడిని అధిగమించేందుకు అన్ని వార్గాల వారు యోగా చేయాలని సూచించారు. సెక్రటరీ శిమ్మయ్య, హరిణి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ..



పొందూరు: రామ్మోహన్‌ను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్



సారవకోట: పంచిరెడ్డి సూర్యనారాయణను పరామర్శిస్తున్న కృష్ణచైతన్య, తదితరులు

పొందూరు: మండలంలోని ధర్మపురం గ్రామానికి చెందిన పప్పల రామ్మోహన్ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనను వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ సోమవారం పరామర్శించారు. సర్పంచ్ మొదలవలస పాపారావు, వైఎస్సార్‌సీపీ నాయకుల ఇళ్లకు వెళ్లారు. పరామర్శించిన వారిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతాడ సత్యప్రసాద్, జిల్లా ఇంటలెక్టువల్ ఫోరం అధ్యక్షుడు కొప్పల ఈశ్వరరావు, పార్టీ నాయకులు మొదలవలస రమణమూర్తి, మాజీ సర్పంచ్ చల్ల ముఖలింగం, మెట్ట ప్రవీణ్, మెట్ట హరి, మహేష్, శ్రీరామ్ తదితరులు ఉన్నారు.

సారవకోట మండలంలో..

సారవకోట: మండలంలో కిన్నెరవాడ గ్రామానికి చెందిన పంచిరెడ్డి సూర్యనారాయణ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనను పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య సోమవారం పరామర్శించారు. చిన్నకిట్టాలపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నరసన్నపేట నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లకొల దండాశి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సవరశివరాంపురం గ్రామానికి చెందిన గొల్లంగి బోడెన్న ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, పల్లి కృష్ణారావు, కోరాడ అప్పయ్య, బొంగు కొండయ్య, కత్తిరి అప్పలనాయుడు, తదితరులు ఉన్నారు.

పల్లె దరిచేరని బస్సు

- ప్రధాన మార్గాల్లోనే సర్వీసులు
- రవాణా సౌకర్యానికి దూరంగా గ్రామీణ ప్రజలు
- పట్టించుకోని అధికారులు



పాతపట్నం బస్టాండ్ వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు, విద్యార్థులు (ఫైల్)

పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గంలో మారుమూల గిరిజన గ్రామాలు అధికం. భౌగోళికంగా అటు ఒడిశా వరకు విస్తరించి ఉంది. ప్రజలు పాలనాపరమైన సేవలకు మండల కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రంతోపాటు డివిజన్ కేంద్రమైన టెక్కలికి వెళ్లాలంటే పడరాని పాట్లు పడుతున్నారు. పక్కా రహదారులున్నా చాలా ప్రాంతాల్లో ఆర్టీసీ సౌకర్యం కల్పిస్తే ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయి. పాతపట్నం నుంచి టెక్కలికి ఆర్టీసీ సర్వీసులు ఉన్నప్పటికీ, కొత్తూరు, హిరమండలం, ఎల్.ఎన్.పేట నుంచి డివిజన్ కేంద్రం టెక్కలికి బస్సు సౌకర్యం లేదు. అధికారులు మాత్రం ఆదాయం రాదన్న సాకు చూపి ఉన్న సర్వీసులను సైతం నిలిపివేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

పాతపట్నం నియోజకవర్గంలో మెళియాపుట్టి, పాతపట్నం, హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాలున్నాయి. మెళియాపుట్టి మండలానికి సంబంధించి మారుమూల గిరిజన గ్రామాలున్నాయి. వీరు మండల కేంద్రానికి చేరుకోవాలంటే అతి కష్టమ్మీద కొండలు దిగి అక్కడ నుంచి ఆటోలపై మండల కేంద్రానికి చేరుకుంటారు. అటు పలాస, ఇటు టెక్కలి డిపోల నుంచి బస్సు సర్వీసులు తిప్పుతున్నా.. అవి ప్రధాన మార్గాలకే పరిమితమైపోతున్నాయి. టెక్కలి నుంచి మెళియాపుట్టి మీదుగా పెద్దలక్ష్మీపురం వరకు రోజుకు మూడు సర్వీసులు.. పలాస నుంచి పెద్ద పద్మాపురం మీదుగా పాతపట్నానికి రెండు సర్వీసులు తిరుగుతున్నాయి. ఇవి తప్పితే మండలంలో ఆర్టీసీ సేవలు నిల్.

- మెళియాపుట్టి నుంచి పట్టుపురం, గారబంద మీదుగా గొప్పిలి వరకు ఆర్టీసీ సర్వీసు నడపాలన్న ప్రతిపాదన ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. ఈ మార్గంలో ప్రైవేటు బస్సులు పదుల సంఖ్యలో ఉన్నాయి.
- గతంలో పాతపట్నం నుంచి పర్లాకిమిడి మీదుగా రొంపివలసకు ఆర్టీసీ సేవలు ఉండేవి. ఇప్పుడు రొంపివలస సర్వీసు నిలిపివేశారు.
- పాతపట్నం మండలానికి సంబంధించి గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే శరణ్యంగా మారుతున్నాయి. మారుమూల రొంపివలస, రొమదల వెళ్లాలంటే ప్రజలు పడరాని పాట్లు పడుతుంటారు. పర్లాకిమిడి నుంచి ఆటోలను ఆశ్రయిస్తుంటారు.
- సీది వంటి ప్రాంతాలకు పరిమిత సర్వీసులు తిప్పుతున్నారు.
- పాతపట్నం మండలంలో దాదాపు అన్ని ప్రాంతాలకు పక్కా రహదారులున్నాయి. కానీ ఆర్టీసీ సర్వీసులు తిప్పడం లేదు.
- కొత్తూరు మండలానికి సంబంధించి శ్రీకాకుళం నుంచి బత్తిలి, అటు పాలకొండ నుంచి కొత్తూరు, హడ్డుబంగి నుంచి కొత్తూరు సర్వీసులు మాత్రమే తిరుగుతున్నాయి. మారుమూల పల్లెలకు మాత్రం ఆటోలే దిక్కు.
- గ్రామాల నుంచి ఆటోలకు రావడం.. అక్కడ నుంచి బస్సులను ఆశ్రయిస్తున్నారు.
- హిరమండలం మండలానికి సంబంధించి వంశధార రిజర్వాయర్ నిర్మాణంతో ఆరు పంచాయతీల్లోని గ్రామాలను వేర్వేరు ప్రాంతాలకు తరలిపోయాయి.
- గులుమూరు, దుర్బలాపురం వంటి మారుమూల గ్రామాలకు ఆర్టీసీ సదుపాయం లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు.
- హిరమండలం నుంచి పాతపట్నం వరకు ప్రత్యేక సర్వీసులు తిప్పితే రవాణా కష్టాలు తీరుతాయని ప్రజలు భావిస్తున్నారు.



హిరమండలం నుంచి గులుమూరుకు ఆటోలో వెళ్తున్న ప్రయాణికులు

- ఎల్ఎన్‌పేట మండలానికి సంబంధించి ప్రధాన రహదారికే ఆర్టీసీ సర్వీసులు పరిమితమయ్యాయి.
- ఇప్పటికైనా ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి పక్కా రహదారులున్న చోట ఆర్టీసీ సర్వీసులు నడపాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రైవేట్ వాహనాలే దిక్కు



ఆర్టీసీ సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలే దిక్కవుతున్నాయి. వారు అడిగినంతగా ఇచ్చుకోవాల్సి వస్తోంది. ఒక్కోసారి ప్రయాణికులు లేకపోతే గంటల తరబడి వేచి ఉండాలి. పని మీద మండల కేంద్రానికి వెళ్లే రవాణా సౌకర్యం లేక సకాలంలో ఇంటికి చేరలేకపోతున్నాం. సమయం వృథా అవుతోంది. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి సర్వీసులు నడపాలి.

– సురవరపు రామారావు, ఆర్.ఎల్.పురం, పాతపట్నం మండలం